క్లుప్తంగా

రైతుల సమస్యలను పరిష్కరించాలి



ఖరీఫ్ సాగుపై సమావేశమైన రైతులు

అల్లవరం: ఖరీఫ్‌లో వరి సాగు చేయాలంటే ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు అధికారులు పరిష్కారం చూపాలని రైతులు డిమాండ్ చేశారు. రెల్లుగడ్డ పంచాయతీ వద్ద పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు శుక్రవారం సమావేశమై ఖరీఫ్ సాగుపై చర్చించారు. ఖరీఫ్‌కు తీవ్ర ప్రతిబంధకంగా ఉన్న ముంపు సమస్యను తీర్చాలని, ప్రధాన డ్రెయిన్లలో ఏర్పాటు చేసిన వలకట్లు తొలగించాలని రైతు నాయకుడు బొక్కా శ్రీను అన్నారు. ముంపు నీరు దిగే ఎస్.రామేశ్వరం మొగ మూసుకుపోవడం, ఉప్పునీరు వరి క్షేత్రాల్లోకి చేరడంతో ఖరీఫ్ సాగులో తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. దీనిపై మంత్రి, ఎంపీ, జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం ఇవ్వనున్నామని తెలిపారు. సర్పంచ్ నడింపల్లి వీర వెంకట సత్యనారాయణ, బసవా వేణు, నడింపల్లి సూరిబాబురాజు, కుడుపూడి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని ర్యాలీ



యానాంలో విద్యార్థులు, టీచర్ల భారీ ర్యాలీ

యానాం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించాలని కోరుతూ శుక్రవారం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ విద్యార్థులు యానాం పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలతోపాటు అత్యుత్తమ విద్య, ఉదయం అల్పాహారంగా పాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, సైకిల్స్, పుస్తకాలు ఉచితంగా సమకూరుస్తున్నప్పుడు తల్లిదండ్రులకు ఏ మాత్రం ఖర్చులేకుండా వారి పిల్లల బంగారు భవిష్యత్‌కోసం ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ కరపత్రాలను పంచారు. హెచ్‌ఎం వి.నాగనళినికుమారి, ముమ్మిడి చిన్నారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ట్రీ కటింగ్

కాట్రేనికోన: మండలంలో కాట్రేనికోన, చెయ్యేరు సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ వెంబడి ట్రీ కటింగ్ పనులు చేపట్టారు. కాట్రేనికోన ఏఈ బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ లైన్లపై వాలిన, ఎండిన చెట్లు ఆకులను తొలగించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రతి శుక్రవారం చేపట్టే ట్రీ కటింగ్‌లో భాగంగా ఆకుల కటింగ్, విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపట్టారు.

వివాదానికి దారి తీసిన యాంటీరూమ్ మూసివేత

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ చైర్పర్సన్ చాంబర్ వద్ద యాంటీ రూమ్ మూసివేత వివాదానికి ఆజ్యం పోసింది. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వార్డు సచివాలయ వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొనేందుకు మహిళా కౌన్సిలర్లు, వారి భర్తలు వచ్చారు. ఆ కార్యక్రమం జరిగే లోపు యాంటీ రూమ్‌లో కూర్చేనేందుకు ఆ రూమ్ తాళాలు తీయాలని అటెండర్‌ను కోరారు. రూం తాళాలను అటెండర్ తీయకపోవడంతో వివాదం రాజుకుంది. చైర్‌పర్సన్ చాంబర్‌లోనే వాదోపవాదాలు జరిగాయి. అది కాస్తా ఒకరిపై ఒకరు కలబడేంత ఘర్షణకు దారి తీసింది. ఈ అంశం పోలీసుల వరకు వెళ్లింది.

గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం



తొలి రిజిస్ట్రేషన్ పత్రాన్ని సర్పంచ్‌కు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

తాళ్లరేవు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమం కింద రీసర్వే పూర్తయిన గ్రామాలలో రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించినట్లు జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని నీలపల్లిలో ఈ మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. జార్జిపేట సర్పంచ్ పేర్ని ఆదినారాయణమూర్తి తల్లి వరలక్ష్మి ఆమె కుమారుడు పేరిట దానపట్టా దస్తావేజును రిజిస్ట్రేషన్ చేయించారు. పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి సచివాలయ రిజిస్ట్రార్‌గా ప్రక్రియను పూర్తి చేశారు. రామలక్ష్మి పట్నాయక్ మాట్లాడుతూ భూ యజమానులు, పట్టాదారులు, రైతులకు వివిధ సేవలను గ్రామ సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. తాళ్లరేవు సబ్ రిజిస్ట్రార్ సునందశ్రీ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఈఓపీఆర్‌డీ భైరవమూర్తి, నీలపల్లి సర్పంచ్ చిట్టూరి నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు దంగేటి సూరిబాబు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో అవస్థలకు చెక్

- అందుబాటులో 536 సేవలు
- ఐ.పోలవరం మండలంలో సచివాలయాల సంఖ్య: 20
- వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య: 9,965



మురమళ్ల గ్రామ సచివాలయం

ఐ.పోలవరం: ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని 2020 అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి నుంచి ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు. ఈ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా తనదైన శైలితో వైఎస్సార్ సీపీ సర్కారు ప్రజలకు విశేషమైన సేవలందిస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను సమన్వయం చేస్తూ సమస్త సేవలను సచివాలయాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చింది. రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం, 50 కుటుంబాలకు ఒక వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు. సచివాలయాల ద్వారా 536 రకాల సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఈ సేవలను 15 నిమిషాల నుంచి 72 గంటల్లో పొందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మారుమూల ప్రాంతాల్లో సైతం సచివాలయ సేవలను పొందే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. వీటికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది.

జగనన్న నిర్ణయం సాహసోపేతం

రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలు ఏర్పాటు చేయాలంటే రూ.కోట్ల వ్యయంతో కూడుకున్న ప్రాజెక్టు. అయినప్పటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. అందులో ఉద్యోగులను నియమించి, అందులో ఫర్నీచర్ ఏర్పాటు చేయడం తలకు మించిన భారం, అయినా లెక్క చేయని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వాటన్నింటినీ చకచక పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చి ప్రజల మన్ననలు పొందారు. జగనన్న తీసుకొన్న నిర్ణయం సాహసోపేతం అని మెచ్చుకుంటూ అందుతున్న సేవల పట్ల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఐ.పోలవరం మండలంలో 20 సచివాయాలు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సేవకు మండల కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. రెండు మూడ్రోజులు తిరిగితే కానీ పని పూర్తి అయ్యేది కాదు. ఇప్పుడు ఆ పరిస్థితికి రాష్ట్ర సర్కారు పూర్తిగా చరమగీతం పాడింది. ప్రజల వద్దకే సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. సచివాలయ వ్యవస్థ పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా ప్రతి ఒక్కరికి అవసరమైన ఆదాయ, కుల, ధృవపత్రాలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు, పట్టాదారు పాస్ పుస్తకాలు, తదితర సేవలు అందుబాటులోకి వచ్చాయి.

గంటల వ్యవధిలో సర్టిఫికెట్



గ్రామ సచివాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఏ సర్టిఫికెట్ కావాలన్నా గంటల వ్యవధిలో ఇస్తున్నారు. నేను కుల ధ్రువపత్రం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. అదే రోజు నాకు సర్టిఫికెట్ ఇచ్చారు. గతంలో ఇలా ఉండేది కాదు. మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేదు. నేరుగా మా గ్రామంలోనే అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి.

\- ఎన్.రవిప్రసాద్, మురమళ్ల

అందుబాటులో సేవలు



సచివాలయాల్లో ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈబీసీ నేస్తం ద్వారా రెండు దఫాలుగా రూ.15వేల చొప్పున వచ్చాయి. ఆ సొమ్ము మా కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉపయోగపడింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైనవారిని గ్రామంలో ఉన్న సచివాలయాల్లోనే నమోదు చేస్తున్నారు.

\- నూలు రేవతి వరలక్ష్మి, మురమళ్ల

దరఖాస్తు చేసుకోగానే వచ్చింది



సచివాలయ వ్యవస్థ వచ్చినప్పటి నుంచి అధికారుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగవలసిన పరిస్థితి లేదు. మాకు ఏమి కావాలన్నా వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకొంటే రోజుల్లో పని పూర్తి అవుతోంది. నేను కాపు నేస్తంకు అర్హురాలిని అని తెలిసి దరఖాస్తు చేసుకొన్నా. అంతే గడచిన మూడు సంవత్సరాల నుంచి ఇప్పటి వరకూ రూ.45 వేల లబ్ధి పొందాను. ఈ డబ్బులు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి.

\-పిల్లా దేవి, మురమళ్ల

వైఎస్సార్ బీమా తక్షణ సహాయం అందజేత

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు పంచాయతీ శ్రీరామ్‌నగర్‌కు చెందిన గుత్తుల శ్రీనివాసరావు(46) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాన్ని స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, దేవస్థానం చైర్మన్ కొల్లు శ్రీను, స్థానిక నాయకులు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి, నందికోళ్ల శ్రీమన్నారాయణ, మట్టపర్తి శ్రీనివాసరావు, కుడుపూడి మల్లేష్, బొంతు శ్రీను తదితరులు పరామర్శించి ఓదార్చారు. తక్షణ సహాయంగా వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.10 వేలు అందజేశారు. మరో రూ.90 వేలు నేరుగా వారి బ్యాంకు ఖాతాకు జమచేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సున్న శంకరనారాయణ, సచివాలయ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు.

చోరీకి విఫలయత్నం

ముమ్మిడివరం: మండలంలోని కొత్తలంక గ్రామంలో దొంగలు పడి చిన్న చిన్న షాపులలో నగదు అపహరించుకు పోతున్నారు. ఈ నెల 12న రెడ్డి పల్లంశెట్టికి చెందిన కాఫీ హోటల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.30వేలు నగదు అపహరించుకు పోయారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు దొంగల ఆచూకీ లభ్యం కాలేదు. మళ్లీ గురువారం రాత్రి అదే షాపులో దొంగతనం చేసేందుకు విఫల యత్నం చేశారు. గునపం, ఇనుపరాడ్డుతో షాపు తలుపులు తెరిచేందుకు విఫల యత్నం చేశారు. అక్కడ అగంతకులు తాగి పడేసిన మద్యం సీసాలు కూడా ఉన్నాయి. కొత్త లంక పరిసర ప్రాంతాలలో కొంతకాలంగా దొంగతనాలు జరుగుతున్నాయని, దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శి సుడిగాలి పర్యటన

- శాఖల పనితీరుపై ఆగ్రహం
- నిధులు వచ్చినా పనులు ప్రారంభించడం లేదన్న ఎమ్మెల్యే అశోక్



అధికారులతో సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ, ఎమ్మెల్యే అశోక్

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ శుక్రవారం యానాంలో సుడిగాలి పర్యటన జరిపారు. ఆయన పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంవత్సరాల తరబడి దీర్ఘకాలిక సమస్యగా ఉన్న కనకాలపేట డంపింగ్‌యార్డు తొలగింపు డిమాండ్ నేపథ్యంలో ఆయన డంపింగ్‌యార్డును ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణం కనకాలపేట డంపింగ్‌యార్డును తొలగించాలని గోపాల్‌నగర్‌లో ఎంపిక చేసిన స్థలంలో రీసైక్లింగ్ పార్కును నెలకొల్పి అందరికీ దాని ప్రాధాన్యతను తెలపాలన్నారు. ఆ ప్రాంతంలో సేంద్రియ ఎరువులు మాత్రమే తయారవుతాయని స్థానికులను అవగాహన చైతన్యవంతులు చేయాలన్నారు. అనంతరం గోపాల్‌నగర్‌లో కోట్లాది రూపాయల ఖర్చుతో నిర్మాణం చేస్తున్న ఆయుష్ ఆసుపత్రి పనులను ఆయన పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అక్కడ నుంచి గోదావరి వరదల సమయంలో తరుచూ ముంపుకు గురవుతున్న ఓల్డ్ రాజీవ్‌నగర్ ప్రాంతాన్ని అక్కడ నిర్మిస్తున్న ఔట్‌ఫాల్ స్లూయిజ్ లాకులను పరిశీలించారు. రాజీవ్‌బీచ్‌ను పరిశీలించి శిథిలమవుతున్న శివమ్‌బాత్‌ను బాగు చేయించాలన్నారు. అక్కడ నుంచి దరియాలతిప్ప ఐలాండ్-3 లో మడఅటవీ పర్యాటక ప్రాంతాన్ని పరిశీలించి వుడెన్ వాక్ వే ద్వారా వెళ్లి బోటు షికారు చేశారు. పర్యాటకాభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీడబ్ల్యూడీ తదితరశాఖల అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు : ఎమ్మెల్యే అశోక్

ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు మంజూరయినప్పటికి అభివృద్ధి పనులు మాత్రం చేపట్టకుండా పీడబ్ల్యూడీ అధికారులు కావాలనే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మను కోరారు. స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ కళాశాల సమావేశ గదిలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లపట్టాలు మంజూరుచేయాలని ఇప్పటికే పలు భూములను పరిశీలించినట్లు తెలిపారు. పసుపురంగు రేషన్‌కార్డుల్లో అర్హులైన బీపీఎల్ వర్గాల వారికి ఎరుపురంగు రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. స్థానిక జీజీహెచ్‌లో ఆధునిక వైద్యసదుపాయాలను కల్పించాలని, డ్వాక్రా మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలను నిలిపివేశారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

పనులు ప్రారంభించకపోతే తక్షణం అధికారులపై చర్యలు.. మరో నెలలో సమీక్ష.. పనులు నిలివేసినవారిపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ హెచ్చరించారు. ముఖ్యంగా ఆయుష్మాన్‌భారత్ ద్వారా వైద్యంను నిరాకరించే ఆసుపత్రులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి భారతప్రభుత్వానికి తెలుపుతామన్నారు. వికలాంగులకు సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. మరో నెలరోజుల్లో మళ్లీ సమీక్ష ఉంటుందని అన్నారు. పుదుచ్చేరి ఇన్‌చార్జి కలెక్టర్ ఎల్.కుమార్, హెల్త్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, ఆర్ఏఓ మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్‌గోయల్, పీడబ్ల్యూడీ, విద్య, వైద్య, విద్యుత్ తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో వలంటీర్లు కీలకం

అవార్డుల ప్రదాన సభలో మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించి క్షేత్ర స్థాయిలో సేవలు అందిస్తున్న గ్రామ, వార్డు వలంటీర్ల పాత్ర నేడు కీలకంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం పట్టణం, రూరల్ మండలానికి సంబంధించి ఎంపిక చేసిన వలంటీర్లకు అవార్డులు, నగదు బహుమతులు అందించేందుకు మున్సిపల్ కార్యాలం ఆవరణలో శుక్రవారం ఉదయం జరిగిన సభలో మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన జరిగిన ఈ సభలో వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో కలిసి అందించి, సత్కరించారు. అమలాపురం మున్సిపాలిటీకి సంబంధించి ఒక సేవా వజ్ర, అయిదు సేవా రత్న, 254 సేవా మిత్ర అవార్డులను వలంటీర్లకు ప్రదానం చేశారు. ఈ మూడు కేటగిరీల అవార్డులతో పాటు మొత్తం రూ.26.70 లక్షలు నగదు బహుమతులుగా అందజేశారు. అమలాపురం మండలానికి సంబంధించి రెండు సేవా వజ్ర, అయిదు సేవా రత్న, 459 సేవా మిత్ర అవార్డులను వలంటీర్లకు అందజేశారు. ఈ మూడు కేటగిరీల అవార్డులతోపాటు వారికి మొత్తం రూ.47.50 లక్షలు నగదు పంపిణీ చేశారు. సేవ వజ్రకు రూ.30 వేలు, సేవారత్నకు రూ.20 వేలు, సేవా మిత్ర అవార్డుకు రూ.10 వేల వంతున అందజేశారు. వలంటీర్లు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనకు క్షేత్రస్థాయి సారథులుగా సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురం మండల పరిషత్ అధ్యక్షురాలు కుడుపూడి భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, అమలాపురం ఎంపీడీవో జొన్నాడ వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ కౌన్సిలర్లు నాగారపు వెంకటేశ్వరరావు, యండమూరి గంగ, దొంగ నాగ సుధారాణి పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

వారు విశ్వసనీయతకు నిదర్శనం

అల్లవరం: సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చెంతకు పారదర్శకంగా చేరవేసేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్లు విశ్వసనీయతకు నిదర్శనమని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరి రావు అధ్యక్షతన గుడ్డివానిచింత వద్ద సత్యకస్తూరి కన్వెన్షన్ హాలులో వలంటీర్లకు వందనం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి విశ్వరూప్ హాజరై సచివాలయ వ్యవస్థకు వలంటీర్లను అనుసంధానం చేసి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో సీఎం జగన్ విజయం సాధించారన్నారు. కోవిడ్, వరద సమయాల్లో వలంటీర్లు సేవలు అమోఘమని కొనియాడారు. వలంటీర్ల ద్వారా వివిధ పథకాల లబ్ధిదారులకు రూ. 2.10 లక్షల కోట్లు వారి ఖాతాలకు జమ చేశారన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రతి పనికి లంచం తీసుకునేవని విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థని రద్దు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. సీఎం జగన్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ని ముఖ్యమంత్రిగా ఆశీర్వదిస్తే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయన్నారు. అనంతరం విశిష్ట సేవలు అందించిన వలంటీర్లను శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలు అందించారు. దృశకళల సంస్థ చైర్మన్ కుడుపూడి సత్యశైలజ, జెడ్పీటీసీ సభ్యుడు కొనుకు బాపూజీ, వైస్ ఎంపీపీ వద్ది గంగ, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు ఖాదర్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకటరావు, ఎంపీటీసీ సభ్యుడు గుబ్బల రంగనాథస్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ సాంబశివప్రసాద్ పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై సీఎస్‌కు వినతి



సీఎస్‌ను కలిసేందుకు తరలివచ్చిన యానాం టీచర్లు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌వర్మ తొలిసారిగా శుక్రవారం యానాం రావడంతో స్థానికులు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఆయనకు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో తమకు దానికి సంబంధించిన నియమ నిబంధనలు, అకడమిక్ క్యాలెండర్‌ను, వర్కింగ్ డేస్‌ను, టైమింగ్స్, తదితర సమగ్ర షెడ్యూల్‌ను ఇవ్వాలని కోరుతూ యానాం యునైటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌కు సైతం అందించారు. పుదుచ్చేరిలో ఐదు రోజులు పనిదినాలు ఉంటే యానాంలో ఆరు రోజులు పనిదినాలు అమలు చేస్తున్నారన్నారు. వేసవి వేడి తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పాఠశాలలకు పంపడం లేదన్నారు. ఏపీలో ఉదయం పూట మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారని యానాంలో సైతం ఆ విధంగా మార్చాలని కోరారు. అధ్యక్షుడు ఎస్ఏ వలీ, ఉపాధ్యక్షుడు తోట వెంకన్న, పాలెపు సత్తిబాబు, నల్లా కమల, కె.శంకరం, జగదీష్, కల్యాణ్‌బాబు, మురళీకృష్ణ, విజయలక్ష్మి, రత్ననాయుడు పాల్గొన్నారు.

ఘనంగా జన భాగిదారి

అల్లవరం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తూర్పులంక గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగిదారి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ కడలి గంగాచలం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సుభాషిణీ మాట్లాడుతూ ఆట, పాట, కథల ద్వారా పిల్లల మనసును హత్తుకునేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పార్వతి, అనంతలక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

పశువుకు బీమా - రైతుకు ధీమా

అమలాపురం రూరల్: వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా పాడి పశువులకు, గొర్రెలు, పందులకు బీమా చేయడం ద్వారా రైతుకు ధీమా ఉంటుందని జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ కర్నెడి మూర్తి అన్నారు. ఈదరపల్లి గ్రామంలో డాక్టర్ సాహిత్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్. విజయరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులు మరణిస్తే పశుపోషకులను ఆదుకొనేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. శిబిరంలో రూ. 40 పశువులకు బీమా చేశారు. గోపాలమిత్ర చీకరుమిల్లి సురేష్, పశు వైద్య సహాయకులు అంబిక, సమత, కిరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

26 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

యానాం: పుదుచ్చేరి పోలీస్ రిక్రూట్‌మెంట్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు పరిశీలిస్తామని శుక్రవారం పుదుచ్చేరి పోలీస్‌శాఖ ఉన్నతాధికారి ఎస్.కుబేరశివకుమరన్ ప్రకటనలో పేర్కొన్నారు. పుదుచ్చేరి గోరిమేడు పోలీస్ శిక్షణ స్కూల్‌కు అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, పీఈటీ అడ్మిట్‌కార్డు, రాతపరీక్ష హాల్‌టికెట్ తీసుకురావాలన్నారు.

ఘనంగా వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో పలువురు పండితులతో గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, మారేడు దళాలతో అర్చన, పూర్ణాహుతి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దివ్యాంగులకు మోటరైజ్డ్ వెహికల్స్ పంపిణీ



దివ్యాంగులకు మోటరైజ్డ్ వెహికల్స్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి పినిపే తదితరులు

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లో విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలో గల శారీరక దివ్యాంగులైన 20 మందికి శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చేతుల మీదుగా మోటరైజ్డ్ వెహికల్స్ (స్కూటీలు) పంపిణీ చేశారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా10 మోటార్ వెహికల్స్ పంపిణీ చేశారు. కోనసీమ జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు కలిపి 70 మోటరైజ్డ్ వెహికల్స్‌ను ప్రభుత్వం అందించిందని మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే వరప్రసాదరావు తెలిపారు. ఒక్కొక్క మోటర్ వెహికల్ ధర రూ.92 వేలు ఉంటుందని విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ బి.రామ్‌కుమార్ తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, విభిన్న ప్రతిభావంతుల పునరావాస అధికారి వై.శ్రీరామ్, రావులపాలెం కేకే ట్రస్ట్ హాస్పిటల్ డాక్టర్ బంటు జాన్ ప్రవీణ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణకు ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ



ఆస్పత్రిలో లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

తాళ్లరేవు: అస్వస్థతకు గురై కాకినాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీహెచ్‌సీ డైరెక్టర్ అద్దంకి లక్ష్మీనారాయణను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పరామర్శించారు. అనారోగ్యంపై అధైర్యపడవద్దని అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభకు సత్కారం



విద్యార్థిని సన్మానించి మెమెంటో, ప్రశంసాపత్రం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గౌతమి

అల్లవరం: పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో సన్మాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డీఎస్ఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శాలువాలతో జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి ఘనంగా సత్కరించి మెమెంటో, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గౌతమి మాటాడుతూ అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను ప్రభుత్వం సత్కరించడం గొప్ప విషయమన్నారు. ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సర్పంచ్ తోట శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు కాండ్రేగుల వాణి అచ్యుతం, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు

తాళ్లరేవు: విద్యార్థులలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు పథకాన్ని అమలు చేస్తోందని ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. శుక్రవారం స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి అనేక పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. మరో ముఖ్య అతిథి జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు బాగా చదువుకుని ఉన్నతస్థానాలలో ఉండాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల స్థాయిలో టెన్త్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన పలివెల ప్రతాప్‌కు రూ.3,000, ద్వితీయ స్థానంలో నిలిచిన అంగాడి గీతాశ్రీ, సంగాడి రామ్‌చరణ్ తేజ్‌కు రూ.2 వేలు చొప్పున, మూడవ స్థానాన్ని సాధించిన కొప్పాడి వైష్ణవిప్రియకు రూ.వెయ్యి నగదు, మెడల్, ప్రశంసా పత్రాలను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం జొన్నాడ ఆశాలత, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మట్టపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యూల్ సాగర్